క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారుల మస్టర్లను పరిశీలిస్తున్న ఏపీఓ ఆదిలక్ష్మి

వేపాడ: జాకేరు పంచాయతీలోని గోపమ్మ చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఉపాధి హామీ పథకం ఏపీఓ ఆదిలక్ష్మి గురువారం పరిశీలించారు. వేతన దారులతో ఆమె మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తేనే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ వేతనం అందుతుందని చెప్పారు. రెండు పూటలా పనులు చేయాలని సూచించారు. ఆమె వెంట ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

చీపురుపల్లి: ప్రజలు ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పాలన సాగించనుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తెలిపారు. ఈ మేరకు గురువా రం ఆయన ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబునాయుడు తొలిరోజే కీలక నిర్ణయాలు తీసుకుంటూ సంతకాలు చేయడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం 16,347 డీఎస్సీ పోస్టుల భర్తీకి తొలి సంతకం చేసినట్లు తెలిపారు. అలాగే ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, పెన్షన్ల పెంపు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ వంటి ఫైల్స్‌పై కూడా సంతకాలు చేసినట్లు వివరించారు. అలాగే మంత్రి పదవులు దక్కించుకున్న నారా లోకేష్, పవన్ కల్యాణ్‌తో పాటు జిల్లాకు చెందిన కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రవేశాల కోసం ప్రచారం



కళాశాలలో చేరాలని విద్యార్థినికి సూచిస్తున్న అధ్యాపకులు

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో మహిళల కోసం నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలో చేరాలంటూ ఉపాధ్యాయులు గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. హెచ్ఎం ఉమామహేశ్వరరావు సహా పలువురు ఉపాధ్యాయులు ఎస్.కోట పరిసర గ్రామాల్లో పదోతరగతి ఉత్తీర్ణులైన బాలికల ఇళ్లకు వెళ్లి కళాశాల విద్యపై అవగాహన కల్పించారు. స్థానికంగా బాలికల కోసం ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన కళాశాల విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు పూలబొకేలతో స్వాగతం



కొట్యాడ హైస్కూల్‌లో విద్యార్థులకు పూలబొకేలతో స్వాగతం పలుకుతున్న హెచ్ఎం పద్మావతి

కొత్తవలస/లక్కవరపుకోట: వేసవి సెలవుల అనంతరం కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు యూనిఫారాలతో ఉత్సాహంగా హాజరయ్యా రు. కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు పూలబొకేలు ఇచ్చి స్వాగతం పలికారు.

పూర్వ ప్రాథమిక విద్యపై నేటి నుంచి శిక్షణ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ నాగమణి

గజపతినగరం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన బోధన అందించే పూర్వప్రాథమిక విద్యపై ఆన్‌లైన్ లో ఇస్తున్న శిక్షణకు అంగన్‌వాడీ కార్యకర్తలు అంతా హాజరు కావాలని గజపతినగరం ఐసీడీఎస్ పీఓ నాగమణి సూచించారు. గజపతినగరం ఐసీడీఎస్ పరిధిలోని మెంటాడ, గజపతినగరం, దత్తిరాజేరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో స్థానిక ప్రాజెక్ట్ కార్యా లయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్వప్రాథమిక విద్యలో కొన్ని మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. వీటిపై ఈనెల 14 నుంచి 20వరకూ ఆన్‌లైన్ శిక్షణ ఉంటుందన్నారు. కేంద్రాలను సకాలంలో తెరవడమే కాకుండా మాతా శిశు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా అంతా పనిచేయాలన్నారు. పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

16 నుంచి బ్రహ్మోత్సవాలు

జామి: మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈనెల 16వ తేదీ నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 16న ఉత్సవాలకు అంకురార్పణ, స్వామివారికి అభిషేకాలు,17న ధ్వజారోహణ, స్వామివారి కల్యాణం, 18న గరుడఉత్సవం, 19న తులాభార సేవ, 20న మృగయవినోదం, 21 చక్రస్నానం, పుష్పయాగం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం

- నవధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల పంపిణీ
- రాయితీపై వరి విత్తనాల పంపిణీకి సిద్ధం



ఎస్.కోట రైతు భరోసా కేంద్రంలో పంపిణీకి సిద్ధం చేసిన వరి విత్తనాలు

శృంగవరపుకోట: ఖరీఫ్ సాగుకు అధికారులు, రైతాంగం సిద్ధమవుతోంది. రైతాంగానికి కావాల్సిన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందివ్వడంతో పాటూ, వారికి కావాల్సిన సమాచారం తెలియజేస్తూ విత్తనాలు రాయితీపై అందిస్తోంది. ఇప్పటికే నేలసారం పెంచేలా నవధాన్యాల విత్తనాలు, పచ్చిరొట్ట పైరుల విత్తనాలు రాయితీపై రైతాంగానికి అందజేశారు. ప్రస్తుతం నైరుతి రుతు పవనాల పలకరింపు తో ఖరీఫ్ పనులకు రైతులు సిద్ధం అవుతుండగా వారికి సహకారం అందించేందుకు వ్యవసాయశాఖ సమాయత్తమవుతోంది.

భూసారం పెంపే లక్ష్యంగా...

భూసారం పెంచడమే లక్ష్యంగా వ్యవసాయశాఖ విస్తృత ప్రచారం చేస్తూ రైతుల్లో నవధాన్యాల సాగు, పచ్చిరొట్ట పైరుల పెంపకంపై అవగాహన కల్పిస్తోంది. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలు, నవధాన్యాల కిట్లు అందజేశారు. గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ ఖరీఫ్ సాగుకు సిద్ధం చేస్తున్నారు.

రాయితీపై పంపిణీకి సిద్ధంగా వరి విత్తనాలు

ఖరీఫ్ వరి సాగు చేస్తున్న రైతాంగానికి విత్తనాలు రాయితీపై పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే వరి విత్తనాలను రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే)కు చేరవేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎస్.కోట, ఎల్.కోట, కొత్తవలస, వేపాడ, జామి మండలాల్లో 8,472 మెట్రిక్ టన్నులు వరి విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచారు.

ఎస్.కోట నియోజక వర్గంలో మండలాల వారీగా కేటాయించిన వరి విత్తనాలు (మెట్రిక్ టన్నుల్లో)	
ఎస్.కోట	1,872.75
జామి	2,367.25
వేపాడ	1,533.25
ఎల్.కోట	2,142.25
కొత్తవలస	552.25

రైతులకు అందజేయనున్న వరివిత్తనాలు, ధరలు, రాయితీ వివరాలు

విత్తన రకం	కిలోలు (బ్యాగ్)	పూర్తి ధర	రాయితీ	రైతుకు అందించే ధర
బీపీటీ-5204	25	రూ.4,180	రూ.1,000	రూ.3,180
ఎంటీయూ-1224	25	రూ.4,180	రూ.1,000	రూ.3,180
ఆర్‌జీఎల్-2537	30	రూ.4,180	రూ.1,000	రూ.3180
బీపీటీ- 3291	30	రూ.3,780	రూ.1,000	రూ.2780
ఎంటీయూ-1064	30	రూ.3,980	రూ.1,000	రూ.2980
ఎంటీయూ-7029	30	రూ.3,980	రూ.1,000	రూ.2980
ఎంటీయూ-1061	30	రూ.3,980	రూ.1,000	రూ.2,980
ఎంటీయూ-1121	30	రూ.3,980	రూ.1,000	రూ.2,980
ఎంటీయూ-1318	30	రూ.3,980	రూ.1,000	రూ.2,980
ఎస్ఎల్ఆర్- 34449	30	రూ.4,050	రూ.1,000	**రూ.3,050**
ఆర్ఎన్ఆర్-15048	25	రూ.4,180	రూ.1,000	రూ.3,180

ఆర్బీకేల్లో పంపిణీకి సిద్ధం



నియోజకవర్గ పరిధిలో నేల స్వభావం, పరిస్థితులకు తగిన విధంగా వరి విత్తనాలు ఇండెంట్ పెట్టాం. వరి విత్తనాలు రాయితీపై ఇచ్చేందుకు అన్ని రైతుభరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాం. రైతులు తమ నేల స్వభావాన్ని బట్టి విత్తన ఎంపిక చేసుకుని, వ్యవసాయ శాఖ అధికారులతో సంప్రదించి తగిన అవగాహనతో వరి నారు పోసుకోవాలి.

– ఎల్.విజయ, కొత్తవలస సబ్‌డివిజన్ ఏడీ

వరి విత్తనాలు- వాటి గుణాలు :

రకం: ఎంటీయూ -7029 (స్వర్ణ)
పంటకాలం: 150 రోజులు
దిగుబడి :ఎకరానికి 3 టన్నులు
గుణాలు: అన్ని భూములకు అనుకూలం, అధిక దిగుబడి, అగ్గితెగులు ఆశించే అవకాశం

రకం: బీపీటీ- 3291 (సోనామసూరి)
పంటకాలం: 135–140 రోజులు
దిగుబడి: ఎకరానికి 2.5 టన్నులు
గుణాలు: గింజ సన్నం, అన్నానికి బాగుంటుంది.అగ్గితెగులు ఆశించే అవకాశం

రకం: బీపీటీ-5204 (సాంబ మసూరి)
పంటకాలం: 145–150 రోజులు
దిగుబడి: ఎకరానికి 2.5 టన్నులు
గుణాలు: సన్నబియ్యం, అన్నం మృదువుగా ఉంటుంది, మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచిది, దోమ ఆశించే అవకాశం

రకం: ఎంటీయూ–1075 పుష్యమి
పంటకాలం: 135 రోజులు
దిగుబడి: ఎకరానికి 2.5 టన్నులు
గుణాలు: సన్నబియ్యం, చేను పడిపోదు, అగ్గితెగులు, దోమపోటు తట్టుకుంటుంది.

రకం: ఎంటీయూ- 1064(అమర)
పంటకాలం: 150 రోజులు
దిగుబడి: ఎకరానికి 2.5టన్నులు
గుణాలు: సన్నబియ్యం, చేను పడిపోదు, గింజరాలదు, ముంపును తట్టుకుంటుంది. దోమపోటును తట్టుకుంటుంది.

రకం: 34449 (నెల్లూరి మసూరి)
పంటకాలం: 125 రోజులు
దిగుబడి: ఎకరానికి 3.2 టన్నులు
గుణాలు: చేను పడిపోదు, పొట్టి రకం, గింజ నాణ్యత ఉంటుంది.అగ్గితెగులు తట్టుకుంటుంది.

రకం: ఆర్‌జీఎల్-2537(శ్రీకాకుళం సన్నాలు)
పంటకాలం: – 165 రోజులు
దిగుబడి: ఎకరానికి 3 టన్నులు
గుణాలు: చేను పడిపోదు,పొట్టిరకం, మిక్కిలి సన్నరకం, 60 రోజుల వరకూ నాటుకోవచ్చు. ఉల్లికోడును తట్టుకుంటుంది.

రకం: ఎంటీయూ–1121(శ్రీధృతి)
పంటకాలం: 120–125 రోజులు
దిగుబడి: ఎకరానికి 2.4టన్నులు
గుణాలు: మధ్యస్థ సన్నరకం, కాండం దృఢంగా ఉంటుంది. అగ్గితెగులు, దోమపోటు తట్టుకుంటుంది.

స్టూడెంట్ కిట్ల పంపిణీ పరిశీలన



స్టూడెంట్ కిట్ల పంపిణీని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ మోహన్‌రావు

మెరకముడిదాం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేయాలని బొబ్బిలి డిప్యూటీ డీఈఓ కె.మోహన్‌రావు ఎంఈఓలకు సూచించారు. మండలంలోని పాఠశాలలకు మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ నుంచి ఎంఈఓ చంద్రశేఖర్, ఎంఈఓ-2 ప్రసాద్ ఆధ్వర్యంలో స్టూడెంట్ కిట్లను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని డిప్యూటీ డీఈఓ మోహన్‌రావు పరిశీలించారు. మండలానికి వచ్చిన స్టూడెంట్ కిట్లు వివరాలను ఎంఈఓలను ఆయన అడిగి తెలుసుకున్నారు. మండలానికి 4,474 కిట్లు వచ్చాయని, తొలిరోజు గర్భాం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న పాఠశాలలకు పంపిణీ ప్రారంభించామని ఎంఈఓలు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఉపాధి హామీ వేతనదారులు

గుర్ల: మండలంలోని పాలవలస గ్రామ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని ఆ గ్రామ వేతనదారులు డిమాండ్ చేస్తున్నా రు. వేతనదారులు గురువారం పనులకు హాజరు కాకుండా ధర్నా చేశారు. గతంలో ఇక్కడ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన సత్యనారా యణ అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో అధికారులు ఆయన్ని సస్పెండ్ చేశారు. ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ కోర్టు తీర్పు ఇవ్వడంతో మండల అధికారుల ఆదేశాల అనుసారం ఆయన గురువారం విధులకు హాజరయ్యారు. అయితే ఆయనకు మేట్‌లు, వేతనదారులు సహకరించలేదు. ఆయనకు వ్యతిరేకంగా వేతనదారులు ఉపాధి పనులను బహిష్కరించి గ్రామంలో ఆందోళన చేశారు. వేతనదారులు మాట్లాడుతూ తన మాట విననివారి జాబ్ కార్డులను తొలగిస్తానని విధుల్లో చేరిన మొదటి రోజే ఫీల్డ్ అసిస్టెంట్ బెదిరిస్తున్నాడని ఆరోపించారు.కొత్త ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని, లేకుంటే తామంతా ఉపాధిపనులకు హాజరుకాకుండా ఉద్యమం చేస్తామని అన్నారు. మండల, జిల్లా అధికారులను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

19న మండల సర్వసభ్య సమావేశం

లక్కవరపుకోట: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన ఈనెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రూపేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

17న వెదుళ్లవలసలో నేత్ర వైద్యశిబిరం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో ఈనెల 17న ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు మాన వీయతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.వి.గోవిందరాజులు గురువారం తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్, మానవీయతా స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈశిబిరంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి సిబ్బంది సేవలందిస్తారని పేర్కొన్నారు. వెదుళ్లవలసతో పాటు సమీప గ్రామాలకు చెందిన నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేష న్లు కూడా చేయిస్తామని చెప్పారు.

బీసీజీ వ్యాక్సినేషన్ శతశాతం పూర్తి చేయండి



బొండపల్లి: గొట్లాంలో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా లెప్రసీ,టీబీ నివారణ అధికారి రాణి



గజపతినగరం రూరల్: మధుపాడలో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్న డాక్టర్ సాయికృష్ణ, వైద్యసిబ్బంది



గంట్యాడ: పెదవేమలిలో వ్యాక్సినేషన్ పరిశీలిస్తున్న ఎంపీహెచ్ఈఓ ఎర్రన్న

బొండపల్లి: క్షయ(టీబీ) బారిన పడకుండా వయోజనులు, ధూమపానం చేసే వారు, హైరిస్క్‌గా పరిగణించబడుతున్న వారందరికీ తప్పనిసరిగా బీసీజీ (బాసిల్లస్ కాల్మెట్ గురిన్) వ్యాక్సిన్ వేయాలని, మండలంలో ఈకార్యక్రమం శతశాతం పూర్తిచేయాలని జిల్లా టీబీ, లెప్రసీ నివారణ అధికారి రాణి వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని గొట్లాం గ్రామంలో గురువారం నిర్వహించిన బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు. క్షయతో పాటు లెప్రసీ నివార ణలో భాగంగా ఇంటింట సర్వే చేసి వయోజను లను గుర్తించి వారికి టీకాలు వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ బి.విశ్వేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ ఏ.వసంతలక్ష్మి, ఏఎన్ఎం సీహెచ్.లక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొ న్నారు.

పెదమేమలిలో బీసీజీ వ్యాక్సినేషన్

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీహెచ్ఈఓ కె.ఎర్రన్న కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. 60 ఏళ్లు పైబడిన వారు, మధుమేహం ఉన్నవారికి, ధూమపానం అలవా టు ఉన్నవారికి, గడిచిన ఐదేళ్లలో క్షయవ్యాధి సోకితగ్గిన వారికి, మూడేళ్లుగా క్షయతో బాధపడుతున్న వారి కుటుంబ సభ్యులకు టీకాలు వేయాలని చెప్పారు. ఏఎన్ఎం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మధుపాడలో ..

గజపతినగరం రూరల్ :మండలంలోని మధుపాడ గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యుడు సాయికృష్ణ ఆధ్వర్యంలో గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇదివరకు టీబీ మందులు వాడినవారు 60 ఏళ్లు దాటిన వారు సుగర్ సమస్య ఉన్న వారు , బరువు తక్కువగా ఉన్న వారు ఈ టీకా వేసుకోవాలన్నారు. టీబీ వైద్యులు రాణి, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలకు స్టూడెంట్ కిట్ల సరఫరా



వేపాడ: వేపాడలో స్టూడెంట్ కిట్ల సరఫరా వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంఈఓలు జగదీశ్వరరావు, బాలభాస్కరరావు

వేపాడ: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించిన స్టూడెంట్ కిట్స్‌ను అధికారులు గురువారం చేరవేశారు. మండల విద్యావన రుల కేంద్రంలో ఎంఈఓలు జగదీశ్వరరావు, బాలభాస్కరరావు పుస్తకాల సరఫరా వాహనాలను జెండాఊపి ప్రారంభించారు. మండలంలో 50 పాఠశాలల్లోని 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బెల్ట్‌లు, సాక్స్‌లు, టైలు, బూట్లు తదితర కిట్లను పాఠశాలలకు పంపించా మని ఎంఈఓలు చెప్పారు. పలు పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, సీఆర్పీలు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దత్తిరాజేరు మండలంలో..

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా 35 గ్రామ పంచాయతీల్లోని ప్రాథమిక,ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పంపిణీ చేసేందుకు స్టూడెంట్ కిట్లను హెచ్ఎంలకు ఎంఈఓ ఎం.వెంకటరావు మండల కేంద్రంలో గురువారం అందజేశా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి పాఠ్య,నోట్ పుస్తకాలు, బూట్లు, అందజేస్తామని చెప్పారు. ఎంఈఓ-2 సుధాకర్, సీఆర్పీలు, తిరుపతిరావు, సత్యనారాయణ, దమ యంతి,తదితరులు పాల్గొన్నారు.

3,836 మందికి

గజపతినగరం: మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు స్టూడెంట్ కిట్లను అందజేస్తున్నామని ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్ తెలిపారు. స్థానిక బాలుర హైస్కూల్‌లోని స్టాక్ పాయింట్ నుంచి గురువారం పాఠశాలల వారీగా కిట్లను హెచ్ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో మొత్తం 3,836 మంది విద్యార్థులకు కిట్లు పంపిణీ చేయనున్నామని చెప్పారు. ప్రతీ విద్యార్థికి బూట్లు, రెండు జతల సాక్స్‌లు, మూడు జతలు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, డిక్షనరీ, బెల్టులు, బ్యాగ్ తదితర సామగ్రిని ప్రతీ కిట్లో ఉంచామని తెలిపారు. పలువురు ఉపాధ్యాయు లు,సీఆర్పీలు పాల్గొన్నారు.



చీపురుపల్లి: మండల కేంద్రంలో స్టాక్ పాయింట్ నుంచి స్టూడెంట్స్ కిట్లను పాఠశాలలకు పంపిస్తున్న ఎంఈఓ బూసినాయుడు

5,503 కిట్లు పంపిణీ

చీపురుపల్లి: నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు వచ్చిన స్టూడెంట్స్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఎం.బూసినాయుడు చెప్పారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో స్టాక్ పాయింట్ నుంచి స్టూడెంట్స్ కిట్లను మండలంలోని పాఠశాలలకు పంపించే కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 67 పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించి 5503 స్టూడెంట్స్ కిట్లు వచ్చాయని చెప్పారు. కిట్లలో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగ్, షూస్, సాక్సులు, టైలు ఉంటాయని చెప్పారు. ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ శంకర్, సీఆర్పీలు కంది రామకృష్ణ, వినోద్, గవిడి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలసలో..

కొత్తవలస: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు స్థానిక ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్ నుంచి స్టూడెంట్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంఈఓ జి.శ్రీదేవి గురువారం ప్రారంభించారు. హెచ్ఎంలకు కిట్లు అందజేసి, వాహనాల ద్వారా పాఠశాలలకు సరఫరా చేయించారు.



కొత్తవలస: కొత్తవలస హైస్కూల్‌లోని స్టాక్ పాయింట్ వద్ద వ్యాన్‌కు లోడ్ చేసిన పుస్తకాలు



దత్తిరాజేరు: దత్తిరాజేరు హైస్కూల్‌లోని స్టాక్ పాయింట్‌లో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ వెంకటరావు



గజపతినగరం: స్టూడెంట్ కిట్ల పంపిణీ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్,తదితరులు

విత్తనాల శాంపిల్ల సేకరణ



చీపురుపల్లి ఆర్బీకే-3లో శాంపిల్లు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

చీపురుపల్లి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు పంపిణీ చేసేందుకు రైతుభరోసా కేంద్రాల్లో(ఆర్బీకే) సిద్ధం చేసిన వరి విత్తనాల మొలకశాతాన్ని పరీక్షించేందుకు శాంపిల్లు సేకరిస్తున్నామని ఏఓ సీహెచ్.రఘునాథ్ తెలిపారు. పట్టణంలోని రైతుభరోసా కేంద్రం–3లో సిద్ధం చేసిన వరి విత్తనాల నుంచి శాంపిల్లను గురువారం ఆయన సేకరించారు.ఆర్బీకేలతో పాటు ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో సైతం విత్తనాల మొలక శాతం పరీక్షించిన తర్వాత రైతులకు విక్రయించడం జరుగుతుందన్నారు. మండలంలోని 14 రైతుభరోసా కేంద్రాల్లో ఎంటీయూ –1121 రకం విత్తనాలు 1,155 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధం చేశామని చెప్పారు. అలాగే బీపీటీ–3291 రకం 150 క్వింటాళ్లు, బీపీటీ–5204 రకం 30 క్వింటాళ్లు, ఆర్ఎన్ఆర్ రకం 10 క్వింటాళ్ల కోసం ఇండెంట్ పెట్టామని తెలిపారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



గొడుబందకు సంబంధించిన రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యకుమారి

వేపాడ: మండలంలోని పాటూరు రెవెన్యూలో వివాదాస్పద గొడుబంద స్థలాన్ని ఆర్డీఓ సూర్యకుమారి గురు వారం పరిశీలించారు. పాటూరు రెవెన్యూలో సర్వే నంబర్ 84/2లో ఉన్న గొడుబంద ఆక్రమణల వల్ల స్వరూ పం మారిపోయిందని గ్రామానికి చెందిన ఆర్.వెంకటలక్ష్మి 2017లో హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా కోర్టు ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఆర్డీఓ ఈస్థలాన్ని పరిశీలించారు. నివేదికకు కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీఓ చెప్పారు. ఆమెవెంట తహసీల్దార్ సత్యం, డీటీ సన్యాసినాయుడు, మండల సర్వేయర్ అప్పలనా యుడు, వీఆర్ఓలు, ఫిర్యాదుదారు వెంకటలక్ష్మి ఉన్నారు.

చేగువేరా జయంతి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ నేతృత్వంలో ప్రపంచ విప్లవకారుడు చేగువేరా 96వ జయంతిని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.సీహెచ్ కేశవరావు మాట్లాడుతూ వలసవాదం, సామ్రాజ్యవాదం, నియంతృత్వాలపై 20వ శతాబ్దంలో అలుపెరుగని పోరాటం నడిపిన విప్లవకారుడు చేగువేరా అని పేర్కొన్నారు. 1951లో అర్జెంటీనా నుంచి మోటార్ సైకిల్ యాత్ర చేసి, పేదల కష్టాలు తెలుసుకుని, క్యూబా విముక్తి కోసం పోరాడారన్నారు. తర్వాత లాటిన్ అమెరికా దేశాల్లో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపినట్టు వెల్లడించారు. బొలీవియాలో నియంత పాలనకు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధాన్ని నడిపి బొలీవియన్ సైన్యం చేతిలో గాయపడి, 1967లో చేగువేరా హత్యకు గురయ్యాడని చెప్పారు. చేగువేరా పోరాటస్ఫూర్తి ప్రపంచానికే మార్గదర్శకమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.వాసుదేవరావు, ఎన్ఎస్ఎస్ పీఓ జి.ఈరన్న, ఎన్‌సీసీ పీఓ షేక్ వలీ, జేఏసీ కోఆర్డినేటర్ డా.సుధీర్, డాక్టర్ శ్రీలక్ష్మి, డా.స్వామినాయుడు, తదితరులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.